క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని ధర్మపురి అయ్యప్పస్వామి ఆలయ ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఆదివారం అయ్యప్ప భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి, గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా భక్తుడు జొన్నలగడ్డ కిరణ్ ఇంటికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కరరెడ్డి, గంగాధర్, చిట్టిబాబు, రవికుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత



గడివేములలో హిందూ సమ్మేళన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: దైవారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కర్నూలులోని ప్రముఖ అధ్యాత్మిక ప్రసంగీకులు సాత్మానంద స్వామి తెలిపారు.సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో హిందూ ధర్మసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రముఖులు శివరామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని,సంస్కృతి సంప్రదాయాలను కాపాడటం ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా భావించాలన్నారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు కటకం రమేష్ , సబ్ డివిజన్ కన్వీనర్ మీనింగ శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ గోవింద రాజులు, కన్వీనర్ డీలర్ శ్రీను,నంద్యాల టౌన్ కన్వీనర్ బాల వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో వెలసిన పురాతనమైన కోనేటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం గన్నవరం పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమద్ వ్రతం సందర్భంగా గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం గ్రామస్తులు స్వామీజీని గ్రామంలో ఊరేగించి వీడ్కోలు తెలిపారు.

గుంతను పూడ్చండి సారూ!




దేవనగర్ వినాయక ఘాట్ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా నడిరోడ్డుపై గుంత

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని దేవనగర్ వినాయక్ ఘాట్ పక్కనున్న మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా మంచినీటి పైప్‌లైన్ లీకై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో సుమారు ఐదు సార్లు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారని, అయినా లీకేజీ ఆగడం లేదని, లీకేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు పేర్కొంటున్నారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

పెయింటింగ్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు నగర పెయింటింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఖాజాబాషా, చాంద్‌బాషా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మెహబూబ్‌బాషా, జాఫర్ బాషా, హనీఫ్‌బాషా, సహాయ కార్యదర్శులుగా మబ్బూల్, సలీంబాషా, ట్రెజరర్‌గా అఫ్రోజ్‌బాషాతోపాటు మరో 25 మందిని కమిటీసభ్యులుగా ఎంపికయ్యారు.

భక్తి శ్రద్ధలతో హనుమత్ వ్రతం



హనుమత్ వ్రతంలో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మన్య సూక్తం పవమాన సూక్తంతో అభిషేకం, హనుమత్ వ్రతాలు జరిగాయి. హనుమత్ కథ శ్రవణం, భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలంకరణలో కోడుమూరులోని ఏబీఎం చర్చి.



రంగుల విద్యుత్ బల్బుల వెలుగులో సి.బెళగల్ ఏబీఎం చర్చి.



గడివేములలో ముస్తాబైన సీఎస్ఐ చర్చి.



విద్యుత్ బల్బుల కాంతులతో సి.బెళగల్ చర్చి

చర్చీలకు క్రిస్మస్ కళ

కోడుమూరు రూరల్ : క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చర్చీలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మండలంలోని కోడుమూరు, పులకుర్తి, వర్కూరు, లద్దగిరి, గోరంట్ల, ప్యాలకుర్తి, కల్లపరి, అమడగుంట్ల, అనుగొండ, వెంకటగిరి గ్రామాల్లోని చర్చీలను రంగురంగుల జెండాలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేయడంతో కొత్త కళ వచ్చింది.

క్రిస్మస్ సందర్భంగా కబడ్డీ పోటీలు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కోడుమూరులోని ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సోమవారం సాయంత్రం మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10,016, రూ.7,016, రూ.5,016లను దాతలు బొమ్మసాని ఆనంద్, పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్ బీసీ రాజు అందజేయనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9966646041సెల్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ముస్తాబైన చర్చీలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రైస్తవ ఆలయాలను క్రైస్తవులు, ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం సుందరంగా ముస్తాబు చేశారు. చర్చీలకు రంగులు వేసి, రంగు రంగుల విద్యుత్ బల్బులతో అలంకరించారు. సి.బెళగల్, పోలకల్, ముడుమాల, కంబహాల్, మారందొడ్డి, ఇనగండ్ల, పలుకుదొడ్డి, కొత్తకోట, బురాన్‌దొడ్డి తదితర గ్రామాలలో పండుగ శోభ తరించుకుంది. విద్యుత్ బల్బులు, పశువుల పాకల ఏర్పాటులో మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఏబీఎం చర్చి సర్వసుందరంగా వైవిధ్యంతో చూపరులను ఆకట్టుకుంటోంది.



సి.బెళగల్లో ఏబీఎం చర్చిలో సుందరంగా ఏర్పాటు చేసిన పశువుల పాక



ఓర్వకల్లులో విద్యుత్ దీపాలతో ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

ఓర్వకల్లు: మండలంలోని గ్రామాల్లో చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలు, రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. దీంతో ముందస్తుగానే క్రిస్మస్ శోభ నెలకొంది. చింతలపల్లె, చెన్నంశెట్టిపల్లె, గుడుంబాయితండా, గుమ్మితం తండా, కన్నమడకల గ్రామాలు వేడుకలకు దూరం కాగా.. భైరాపురం, మీదివేముల, కేతవరం, కాల్వ, తిప్పాయపల్లె, గుట్టపాడు, ఎన్ కొంతలపాడు, వెంకటాపురం, కొమరోలు, సోమయాజులపల్లె, పాలకొలను గ్రామాల్లో పాక్షికంగా, ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె, పూడిచెర్ల, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె గ్రామాల్లో క్రైస్తవులు సంపూర్ణంగా వేడుకలను జరుపుకుంటారు.



బస్తిపాడులో రంగు రంగుల విద్యుత్ అలంకరణతో సుందరంగా ముస్తాబైన చర్చి

కల్లూరు: సోమవారం క్రిస్మస్ పండగ సందర్భంగా కల్లూరు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రార్థనాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కొన్ని చర్చిల్లో క్రీస్తు పుట్టుకను తెలిపే నమునాలు ఏర్పాటు చేశారు.

గడివేముల: క్రీస్తు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని గ్రామాల్లో చర్చీలు ముస్తాబయ్యాయి.ఆదివారం రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాల ఏసు పుట్టుకను వివరించే పాకలను నెలకొల్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

కోడుమూరు రూరల్ : క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి సూచించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, గ్రామసర్పంచు ప్రవీణ్, వైఎస్సార్ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్యా విక్రమ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా జీవనం సాగిస్తున్నారని, క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న జిల్లా క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.15,016, రెండో బహుమతిగా రూ.10,016, మూడో బహుమతిగా రూ.5,016లను దాతల సహకారంతో అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌నాయుడు, సోములు, శంకర్, లింగన్న, వెంకట్రాముడు పాల్గొన్నారు.



పులకుర్తిలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

- 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ సచివాలయాల పరిధిలో ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాలను విజయవంతం చేద్దామన్నారు. నైపుణ్యం గల క్రీడాకారుల గుర్తించి ప్రోత్సహించడమే పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్‌మెంటన్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 26వ తేది ఓర్వకల్లు మండలం కాల్వ, హుస్సేనాపురం సచివాలయాల్లో జరిగే క్రీడా పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రశాంత్ కిషోర్ టీడీపీ అధినేత చంద్రబాబు కలయికపై విలేకరులు ప్రశ్నించగా రాజకీయాల్లో ఎవరు ఎవరినైనా కలవచ్చునన్నారు. అంతిమంగా ఎవరికి అధికారం కట్టబెట్టాలో నిర్ణయించేది ప్రజలే అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్‌ఆర్‌సీపీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపేగు.. చిన్నపేగు కలిసే చోట కణితి

- శస్త్రచికిత్స చేసి ఊరట కలిగించిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): క్షయ కారణంగా కడుపులో పెద్దపేగు, చిన్నపేగు కలిసే ప్రాంతంలో ఒక గడ్డలా కణితి ఏర్పడి చాలా కాలంగా ఇబ్బంది పడుతున్న ఓ రోగికి కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి ఊరట కల్పించారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సూరా జానకిరామ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఆదివారం వెల్లడించారు. వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్ కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పి, విరేచనం కాకపోవడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈ సమస్యలతో ఆయన ప్రొద్దుటూరు, కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో వైద్యులను కలిసి చికిత్స తీసుకున్నారు. వారిలో ఒకరు చిన్నపేగుకు, పెద్దపేగుకు కలిపి ఒక స్టెంట్ వేశారు. సాధారణంగా క్యాన్సర్ కేసుల్లోనే స్టెంట్ వేస్తారు. అది కూడా తాత్కాలికం. స్టెంట్ వేసినా సమస్య తీరకపోవడంతో ప్రవీణ్‌కుమార్ కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చాడు. ఇక్కడ వైద్యపరీక్షలు చేసిన అనంతరం కణితి ఉన్నట్లు గుర్తించి దానిని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ కణితిని బయాప్సీ తీసి పంపిస్తే క్షయ అని తేలింది. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నా'డని డాక్టర్ జానకిరామ్ తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఆదివారం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లోని దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ..అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ. 26 వేల జీతం ఇవ్వాలన్నారు. 62 సంవత్సరాలకు పదవి విరమణ వయస్సు నిర్ధారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, చంద్రశేఖర్, వీరశేఖర్, ఎన్.శేషయ్య, టి.రాముడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీలో పలువురికి స్థానం

కర్నూలు కల్చరల్ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కమిటీలో పలువురు నాయకులకు స్థానం కల్పిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రంగోల గోపి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కె.పావని, మీడియా కో-కన్వీనర్‌గా మునుస్వామి, నంద్యాల మన్‌కీ బాత్ ప్రోగ్రామ్ కో-కన్వీనర్‌గా రామ్ మనోహర్‌నాయుడులకు కమిటీలో స్థానం కల్పించారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేసే ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారంతో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. శనివారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో చేపట్టిన దీక్షలకు ఆర్‌టీఏ జిల్లా మాజీ కార్యదర్శి బాబు, ఐలు సంఘం జిల్లా నాయకులు మురళీ మోహన్, ఒంకార్, రవికుమార్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మలమ్మ మద్దతు తెలిపారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఇందులో ఉమెన్స్ కేటగిరీలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన స్టాఫ్‌నర్సు ఎల్. మంజులదేవి ప్రతిభ చూపారు. 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్ట్రోక్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఆసుపత్రి చరిత్రలో ఒక మహిళ స్విమ్మింగ్ పోటీలో పతకాలు సాధించడం ఇదే మొదటిసారి.



స్విమ్మింగ్ పోటీలో పతకాలు సాధించిన మంజుల

తైక్వాండో క్రీడకు సహకారమందిస్తా



బెల్టులు ప్రదానం చేస్తున్న బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణ

కర్నూలు (టౌన్) : దినదినాభివృద్ధి చెందుతున్న తైక్వాండో క్రీడకు తన వంతు సహకారం అందిస్తానని బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ కేఎంసీ పార్కులలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సంయుక్త కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత చాటుతున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలిరాగా వారికి పూజారులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: స్థానిక మారుతి నగర్‌లో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఆలూరుకు చెందిన రవీంద్రరావు దంపతులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఊరికి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో వారి బంధువులు, చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఇంటి యజమాని వచ్చి ఫిర్యాదు చేస్తే దొంగలు ఏమి ఎత్తుకెళ్లారో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

కార్పొరేటుకు దీటు.. సాంకేతికతకు చోటు

- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన ప్రభుత్వం
- ప్రతి ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్
- ఎంతో ఉపయోగంగా ఉన్నాయంటున్న విద్యార్థులు
- నియోజకవర్గంలో 1134 ట్యాబ్‌లు పంపిణీ

మండలాలవారీగా పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లు..

మండలం	అందించిన ట్యాబ్‌లు
గడివేముల	170
పాణ్యం	624
ఓర్వకల్లు	170
కల్లూరు	170



గడివేముల జెడ్పీ స్కూల్‌లో విద్యార్థినికి ట్యాబ్‌ను అందిస్తున్న హెచ్‌ఎం



ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్

గడివేముల: కార్పొరేటు స్కూళ్లలోని విద్యార్థులతో ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు పోటీ పడాలని, నిరుపేద విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. విద్యార్థులకు 8వ తరగతి నుంచే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించి చర్యలు చేపట్టింది. గత ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్‌లనును అందించారు. ఇలా ఏటా అందించాలని నిర్ణయించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో బైజూస్ సహకారంతో వివరణాత్మక, విశ్లేషణాత్మక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాఠ్యాంశాలను ట్యాబ్‌లో పొందుపరిచారు. పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన ట్యాబ్‌లను పాఠశాలలకు సరఫరా చేశారు. ఈ నెల 21వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రజాప్రతినిధులు,అధికారులు వాటిని పంపిణీ చేశారు.

క్వాలిటీగా ట్యాబ్..

శాంసంగ్ కంపెనీకి చెందిన ప్రతి ట్యాబ్‌లో 3 జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ, అదనంగా 64 జీబీ మెమొరీ కార్డు, మూడేళ్ల వారంటీ ఇవ్వనున్నారు. ట్యాబ్ నాణ్యమైన పౌచ్‌తో పాటు అవసరమైన కేబుల్స్ ఇస్తున్నారు. దీంతో పాటు బైజూస్ కంటెంట్ లోడ్ చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు.

సీబీఎస్ఈ విధానంలోకి రావాలన్నది ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా బైజూస్ కంటెంట్‌తో నాణ్యమైన ట్యాబ్‌లను అందిస్తుంది. విద్యార్థులను 2025 నాటికి సీబీఎస్ఈ విధానంలో మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారు. సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాల బోధనకు ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయి. ఇంగ్లిష్ భాషను వినడం,చూడటం ద్వారా భాషపై పట్టు సాధించవచ్చు.

– విమలా వసుంధర దేవి,ఎంఈఓ–2,గడివేముల

సాంకేతిక పరిజ్ఞానం అవసరం



నేను 8వ తరగతి చదువుతున్నా. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యారంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో విద్య అందించడం ఎంతో అవసరం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంతంగా కొనుక్కునే స్థోమత ఉండదు. ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన ట్యాబ్‌లను అందజేయడం సంతోషకరం. – ఝాన్సీ,8వ తరగతి

విద్యార్థుల ఉన్నత చదువుల కోసం



నేను మోడల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నారు. గత ఏడాది నాకు ఇచ్చారు. అది నాకు ఎంతో ఉపయోగంగా ఉంది. ట్యాబ్ ఇవ్వడం చాలా ఆనందం ఉంది.

–జోష్మిత,మోడల్ స్కూల్,గడివేముల

చదువుకోవాలనే ఆకాంక్ష పెరిగింది



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నాలో చదువుకోవాలనే ఆకాంక్ష పెరిగింది. మాకు ట్యాబ్‌లను అందించడం సంతోషంగా ఉంది. ట్యాబ్‌లోని పాఠ్యాంశాలతో అదనపు సమాచారం తెలుస్తుంది. సులభంగా అర్థమవుతున్నాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలో చేరితే చదువులు రావనేవారు. ప్రభుత్వ చర్యలతో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో మెరుగుపడ్డాయి. మా కోసం ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన సీఎం జగన్ మామకు ధన్యవాదాలు.

– కౌసర్,8వ తరగతి విద్యార్థి, ఏపీ మోడల్ స్కూల్, గడివేముల